స్కెచ్

# పంతులుగారి సాహసం

హైమవతి

వేసవికాలం మళ్లుతోంది. తొలకరించింది.

సాయంత్రం నుంచీ చినుకులు పడటమే గాని వాన పడటంలేదు. అమావాశ్యరాత్రి నక్షత్రాలు కూడా కనబడటంలేదు. మరీ చీకటిగా వుంది.

వెంకట జగన్నాధశర్మగారు నడుం వాల్చేరు. ఇంట్లోవున్న చాలామంది చుట్టరికాలకు వెళ్ళేరు. ఇద్దరు కొడుకులూ తనూ కోడలున్నూ వున్నారు. రాత్రి పది దాటింది. అయినా పంతులుగారికి నిద్రరాలేదు. పెద్దకొడుకు గోపాలం సినీమా కెళ్ళాడు. సైకిలుమీద పట్నంనుండి వచ్చేసరికి యెలాగా మరో అరగంట అవుతుంది.

దొంగల హడావుడి బాగావుంది. పంతులుగారి మనస్సు పరిపరివిధాల పోతూంది. కళ్ళుమూసేసరికి ఎదురుగా ఎవడో వచ్చినట్టే భ్రాంతి. అయినా తమాయించుకుని గట్టిగా కళ్లుమూశారు. చిన్న కొడుకూ, కోడలూ వాళ్ళ మానాన వాళ్ళు పడుకున్నారు మేడమీద. క్రిందను తనొక్కడే. వీరిగాడిని పడుకోమంటే—యేదో పనుందని వెళ్ళిపోయాడు. అయినా యీ ఆడవాళ్ళతో బాధలు పడలేం. యీ చీకటి రాత్రిళ్ళలో పుట్టింటి కెళ్ళడమేంటి? అదీ ముసలికాలంలో! పంతులుగారు చీదరించుకున్నారు.

సామాను కొట్లో చప్పుడు! పంతులుగారి ప్రాణాలు ఒక్కక్షణం ఎక్కడికో ఎగిరిపోయి మళ్ళీవచ్చాయి. గట్టిగా కళ్లుమూశారు. చప్పుడు అవుతూనేవుంది. ఒత్తిగిల్లారు వెల్లకిలాపడుక్కున్న వారల్లా. ఈసారి పాత్రసామాను గలగలమంది. మరి అనుమానం అక్కర్లేదు. దొంగలే పెరటివేపు గోడకి కన్నం పెట్టి చొరబడ్డారు. ఆ గోడమరీ అల్పంగావుంది- యీ వేసవిలో దాన్ని బాగు చేయిద్దామనుకున్నారు కాని అవకాశంచిక్కలేదు.

అయితే యిప్పుడేం చెయ్యడం? కేకవేస్తే?!— అమ్మయ్యో - వాళ్లు మీదబడతారేమో! ఎంత మంది వచ్చేరో!-పోనీ మేడమీదకివెళ్ళి చిన్నబ్బాయిని పిలుస్తేనో? యీలోగా లోనికి జొరబడి పెద్ద గదితాళం పగలకొడతారేమో దొంగలు. లేచారు పంతులుగారు. మెల్లగా మేడమెట్లెక్కడానికి ప్రయత్నించారు. నాలుగు మెట్లెక్కారు. కాలాడటంలేదు. తమాయించుకుని మరో అడుగు వేశారు. ఇక లాభంలేదు. గుండెలు శరవేగంతో కొట్టుకుంటున్నాయి. ముందు తలుపు చప్పుడైంది. తలుపు గడియ పగలకొడుతున్న చప్పుడు. నిలుచున్నపాటునా కూలిపోయారు. ఒక్కక్షణంలో తెప్పరిల్లి క్రిందకి దిగిపోయారు. ఏంచెయ్యడానికీ పాలుపోవడంలేదు. వీధిలోకి వెళితే-ఎవర్నన్నా పిలవొచ్చును. అవును అదే మంచిది. వెధవది మూడు ద్వారాలు దాటుతేనేగాని వీధిలోకి వెళ్ళడంకాదు. ఒకద్వారం తెరిచారు. మేడమెట్లు మీంచి ఎవరో దిగుతున్న చప్పుడు. వెధవలు అలా వస్తున్నారా? "ఎవరది?" అందామనుకున్నారు. కాని నోరాడలేదు. తెల్లబట్టలు!— దొంగలు తెల్లబట్టలు వేసుకుంటారా? ఏమో— యీ నాగరిక కాలంలో దొంగలూ దొరల్లాగే వుంటున్నారు. మరీదగ్గరికొచ్చాడు వ్యక్తి. గట్టిగా కళ్లు మూసుకుని తలుపుచాటుకు వెళ్లిపోయారు వెంకట జగన్నాధ శర్మగారు. మనస్సులో ఆంజనేయ దండకం మెదులుతోంది.

"నాన్నా"

ప్రాణాలు కొంచెం స్వస్థానంలో కొచ్చినట్టనిపించింది.

"ఎవరు చిన్నబ్బాయా—"

"అవును. కొట్లో చప్పుడవుతూంటేను."

"అవున్రా—" "పద చూదాం."

"వుండు సాహాసం అన్ని వేళ్లలోనూ పనికిరాదోయ్—ఎటొచ్చీ—"

"ఫరవాలేదు నాన్నా—చేతిలో కర్రవుంది."

"అయినా వీధులోకెళ్ళి ఎవర్నన్నా పిల్చుకొద్దాం."

సామానులన్నీ చిందరవందర అయిపోతున్న చప్పుడు బాగా వినబడిపోతూంది.

కొట్టు తలుపుతియ్య బోయాడు చిన్నబ్బాయి.

"ఒరేయ్ సాహసం పనికిరాదురా." అబ్బాయిని వెనక్కు లాగేశారు పంతులుగారు.

వీధి తలుపు తట్టుతున్న చప్పుడు.

"ఎవరది?—"ఇంట్లోనుంచే.

"నేను—" కొంచెం భీకరంగా వినిపించింది

"అంటే—"

"నేనే—"

"అన్నయ్య నాన్నా" తలుపు తీశాడు చిన్నబ్బాయి.

"ఏం—ఏం జరిగింది."

"కొట్లో దొం...దొంగలు."

"అలాగా—రండి చూదాం."

పంతులుగారికి ధైర్యం చిక్కింది కాస్త.

కొట్టు తలుపు తెరిచారు. టార్చిలైటు వేశాడు పెద్దబ్బాయి. ఎక్కడా ఎవరూ కనిపించడంలేదు. లైటు ఆర్పగానే బిందెల చప్పుడు. ఆ ప్రక్కనే పెద్ద అండాకూడా వుంది. అండా రింగులు ఆడుతున్నాయి.

"నిజంగా అండాలో దాక్కున్నాడు దొంగ అనుమానంలేదు—" స్థిరీకరించుకున్నారు పంతులుగారు.

కాలు క్రింద ఏదో మెత్తగా పడినట్టనిపించింది. త్రుళ్ళిపడి ఒక్క గంతేశారు. చిన్నబ్బాయి అందుకున్నాడు చెయ్యి.

"వుండు నాన్నా లైటు వెలిగిస్తా." వెలిగించి తెచ్చాడు చిన్నబ్బాయి.

"జాగ్రత్తగా అబ్బాయి తొందరకూడదు-"

"ఏం ఫర్వాలేదు-" అన్నదమ్ములిద్దరూ సామానంతా సర్దుతున్నారు. బిందెలో ఒక జంతువు కదులుతున్నట్టనిపించింది టార్చిలైటుతీసి చూచాడు పెద్దబ్బాయి.

ఫకాలున నవ్వాడు.

అర్థంకాలేదు పంతులుగారికి—

"పంది కొక్కు నాన్నా—"

"ఆఁ-దీని దుంపదెగా-" ముఖంలో నవ్వు.

"మనల్ని యింత కంగారు పెట్టింది కనుక దీన్ని విడువరాదు" తన నిర్ణయాన్ని వెలిబుచ్చాడు చిన్నబ్బాయి.

చేతికర్రతో అదిమిపట్టి వెలికి తీశాడు పెద్దబ్బాయి, పందికొక్కుని.

"పట్టుకుంటే కరుస్తుంది పదిలం" పంతులుగారి సలహా.

తన పైపంచె నాలుగు మడతలుపెట్టి పందికొక్కుకిచుట్టి-గట్టిగా పట్టుకున్నాడు చిన్నబ్బాయి.

విదిలించేసింది పందికొక్కు.

"ఆఁ...దీని......" పారిపోతున్న పందికొక్కువేపు ఆశ్చర్యంగా చూశారు పంతులుగారు.

---

(8-వ పేజీ తరువాయి)

నుంచి మార్పులు (ఇంటర్ తరగతులను ఎత్తివేసి, మూడు సంవత్సరాల డిగ్రీ కోర్సు, ఏడు సంవత్సరాల సెకండరీ విద్య) త్వరితంగా చేస్తున్నారు. మరికొన్ని రాష్ట్రాలలో ప్రాథమిక పాఠశాలలను బేసిక్ స్కూల్సుగాను, సెకండరీ స్కూల్సును సర్వార్థసాధక పాఠశాలలుగాను మార్చడానికి శ్రద్ధ చూపుతున్నారు.

ఇక ఆంధ్రరాష్ట్రానికి సంబంధించినంతవరకు సెకండరీ విద్యలో, అందులోను విద్యార్థులకు కావలసిన కనీసపు మార్కులు నిర్ణయించడం, విద్యార్థికి వుండదగు కనీసపు వయస్సు నిర్ణయం ఎస్. ఎస్. యల్. సి. మోడరేషన్ బోర్డు మూడవఫారంవరకు ఉచితవిద్య వగైరా ఏర్పాట్లకు శ్రద్ధ చూపుతున్నది. నిజానికి సర్వార్థసాధక పాఠశాలలు, బేసిక్ విద్య, ప్రీ-యూనివర్శిటీ కోర్సులువంటి వానిద్వారా విద్యాభ్యాసంలో "వైవిధ్యాన్ని" "వికేంద్రీకరణను" ప్రవేశపెడుతున్నప్పుడు, హిందీవంటి భాషలో నూటికి 15 మార్కులు కనీసంగా రావాలనే నిర్ణయంవంటివి హాస్యాస్పదంగా వున్నవి. పరీక్షలనేవానికి సాలు నిల్వను కాక, సంవత్సరంమీద జరిగే అనేక పరీక్షలలో తెలివితేటలను కేవలం మార్కులలో కాక రచనలో, ప్రసంగలో, నడతలో చూపిన విద్యార్థులను ఉత్తీర్ణులుగా నిర్ణయించే పద్ధతుల విదేశాలలో వలె అనుసరించడంవల్ల సత్ఫలితాలు కలుగగలవేమో!—"గౌరీశంకర్"